RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com


# శ్రీ తొలిక్రాంతి

SRITHOLIKRANTHI

సామాన్యుడి ఆయుధం.. తొలిక్రాంతి అక్షరం

| భద్రాద్రి కొత్తగూడెం | ఆదివారం | 19.04.2026 | సంపుటి : 1 | సంచిక : 18 | పేజీలు : 8 | వెల : 2/- | Editor |
|---|---|---|---|---|---|---|---|
| Bhadradri Kothagudem | Sunday | 19.04.2026 | Volume : 1 | Issue : 18 | Pages : 8 | Cost : 2/- | Malothu Ramarao Chandrakala |

## సన్ రైజర్స్ సత్తా...




7

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ప్రతిపాదన

- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- హైదరాబాద్‌ను జాతీయ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే వ్యూహం
- ఈవీ, హైడ్రోజన్, రోబోటిక్స్ రంగాల్లో భారీ ప్రణాళికలు

**ఢిల్లీ, ఏప్రిల్ 18:**
తెలంగాణను దేశ పారిశ్రామిక రంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిను ఢిల్లీలో కలిసి బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కూడా పాల్గొన్నారు. తెలంగాణరైజింగ్ విజన్‌లో భాగంగా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను సీఎం కేంద్రానికి సమర్పించారు.



## రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు

క్రాస్ బ్రీడ్ బంధం" వ్యాఖ్యలు
బీజేపీతో సంబంధాలపై ఆరోపణలు
ఢిల్లీ ఘటనను ప్రస్తావించిన మాజీ మంత్రి
కాంగ్రెస్ నాయకత్వంపై ప్రశ్నలు

2





Ai Image

## సుత్తితో కొట్టా.. కత్తితో గొంతు కోసా..

- శవం ఇక్కడుంది.. వచ్చి చుడండి.. నేనూ ఇక్కడే ఉంటా
- హత్య చేసి కూల్గా పోలీసులకే ఫోన్ చేసి చెప్పిన మహిళ

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**
ఉత్తరప్రదేశ్ రాష్ట్రము ఆగ్రాలోని హోటల్లో నిన్న జరిగిన సంఘటన అందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఓ వివాహిత తనతో వచ్చిన ఒక వ్యక్తిని హోటల్ రూంలోనే సుత్తెతో బాది తేరుకునేలోపే గొంతును కత్తితో కోసింది. ఆపై రక్తపు మడుగుల్లో శవాన్ని వదిలి నేరుగా రిసెప్షన్ కు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చింది. 'నేను

మిగతా 2వ పేజీలో..

# జగిత్యాల గడ్డపై మళ్లీ జైత్రయాత్ర!

### 20న కేసీఆర్ భారీ బహిరంగ సభకు రంగం సిద్ధం

గులాబీ బాస్ శంఖారావం..
కాంగ్రెస్ కోటలో కలవరం
మళ్లీ అదే గడ్డ.. అదే సెంటిమెంట్..
బీఆర్ఎస్ లోకి జీవన్ రెడ్డి..
భారీగా అనుచరగణం
గులాబీ లీడర్ రీ ఎంట్రీ..
క్యాడర్ లో ఫుల్ జోష్
జగిత్యాల సభతో వచ్చే ఎన్నికలకు రెడీ అనే సంకేతాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**
తెలంగాణ రాజకీయాల్లో మరో చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. ఉద్యమ కాలంలో ఎక్కడైతే జైత్రయాత్రతో ప్రభంజనాన్ని సృష్టించి ఢిల్లీ పీఠాన్ని కదిలించారో, మళ్లీ అదే జగిత్యాల గడ్డపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభకు సిద్ధమయ్యారు. 20వ తేదీన నిర్వహించనున్న ఈ సభను కేవలం చేరికలు, రాజకీయ సమావేశంగా కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒక యుద్ధ ప్రకటనగా బీఆర్ఎస్ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి.

మిగతా 2వ పేజీలో..



## జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం: కేటీఆర్

కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు, పండుగ వాతావరణం
కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన కేటీఆర్
లక్షలాది ప్రజల సమక్షంలో సభ విజయవంతం అవుతుందన్న నమ్మకం

**జగిత్యాల, ఏప్రిల్ 18:**
జగిత్యాలలో ఈ నెల 20న నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జగిత్యాలలో

మిగతా 2వ పేజీలో..





## మియాపూర్‌లో చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభం
- ఆధునిక వైద్య సౌకర్యాల పరిశీలన
- ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**
రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మియాపూర్‌లోని మాధవ్ నగర్‌లో ప్రణయ చిల్డ్రన్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హైదరాబాద్ నగరం ఆరోగ్య రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అత్యాధునిక

మిగతా 2వ పేజీలో..



2

## కోర్టు ధిక్కరణపై అత్తాపూర్ ఆర్డీవోకు జైలు శిక్ష

హైకోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం తీవ్రంగా పరిగణన
పెద్దషాపూర్ భూ వివాద కేసులో కీలక తీర్పు
నెలరోజుల జైలు, జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఆగ్రహం



2

## గృహనిర్బంధంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్‌పై విమర్శలు
- ముఖ్యమంత్రి నివాస ముట్టడి పిలుపు నేపథ్యంలో ఉద్రిక్తత
- నారీశక్తిని అణచలేరని హెచ్చరిక


## తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు వేగం

- మౌలిక వసతుల విస్తరణకు చర్యలు
- వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో ప్రాజెక్టులకు ప్రణాళిక
- మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశంలో కీలక ఆదేశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 18:**
తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు.
శనివారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ అధికారులు, ఏవియేషన్ శాఖ ప్రతినిధులతో కలిసి మంత్రి

మిగతా 2వ పేజీలో..



## 44.6 డిగ్రీల రికార్డు

- తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది..
- ఉదయం నుంచే భానుడి బీభత్సం
- కొమురంభీమ్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత
- ప్రజలకు జాగ్రత్తలు సూచించిన వాతావరణ శాఖ

3



## ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబాటు

- పీసీసీ అధ్యక్షుడి కీలక వ్యాఖ్యలు
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం

3

RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
తొలిక్రాంతి
SRITHOLIKRANTHI



## సుత్తితో కొట్టా.. కత్తితో గొంతు కోసా..

**మొదటిపేజీ తరువాయి**

ఒక వ్యక్తిని సుత్తెతో కొట్టా.. కత్తితో గొంతు కోసా.. శవం హోటల్ రూంలో ఉంది.. నేను మీరొచ్చేవరకు రిసెప్షన్ వద్దే వుంటా..' అని చెప్పిందట. సంఘటన స్థలానికి పోలీసులు రాగ అప్పటికే సదరు వ్యక్తి రక్తపు మడుగులో శవంగా పడున్నాడట. సదరు మహిళను పోలీసులు విచారించగా వివాహితనైన తనకు ఏడేళ్ల కొడుకు ఉన్నాడని తెలిపింది. హత్యకు గురైన వ్యక్తి తనకు దూరపు బంధువని అతనితో తనకు వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపింది. తరుచు డబ్బులకోసం బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో విసిగి వేసారి పతకం ప్రకారమే హోటల్ కి పిలిచి హత్య చేసానని తెలిపింది. హత్య చేసిన పిమ్మట ఎలాంటి ఒత్తిడికి లోనవక పోలీసులకు సమాచారం ఇవ్వడం కొత్త తరం కాల్ క్రిమినల్ ట్రెండ్ కి నిదర్శనం అన్నట్టు కనపడుతోంది.

## గృహనిర్బంధంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం

- **మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్‌పై విమర్శలు**
- **ముఖ్యమంత్రి నివాస ముట్టడి పిలుపు నేపథ్యంలో ఉద్రిక్తత**
- **నారీశక్తిని అణచలేరని హెచ్చరిక**




**హైదరాబాద్, ఏప్రిల్ 18**

అక్రమ గృహనిర్బంధాలతో మహిళల ఆగ్రహాన్ని అణిచివేయలేరని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్, ఇండీ కూటమి వైఖరిని ఆయన తప్పుబట్టారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ చిత్తశుద్ధితో తీసుకువచ్చిన బిల్లును అడ్డుకోవడం మహిళా వ్యతిరేక ధోరణికి నిదర్శనమని అన్నారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి నివాస ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు తనను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.
పోలీసు నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో మహిళా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం సరికాదని ఆయన హెచ్చరించారు. నారీశక్తి తమ హక్కుల సాధన కోసం మరింతగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, మహిళల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**



ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది అని, ఇక్కడి నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.
కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి జగిత్యాల ప్రజల ఆశీర్వాదంతోనే ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని, బీఆర్ఎస్‌కు మళ్లీ భారీ మద్దతు లభిస్తున్నదని అన్నారు. కేసీఆర్ సంవత్సరం తర్వాత బహిరంగ సభకు హాజరవుతుండటంతో ప్రజల్లో భారీ ఆసక్తి నెలకొందన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ సభను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయంగా చిన్నచిన్న ప్రయత్నాలకు పాల్పడుతున్నారని, మేడిగడ్డ పర్యటనల ద్వారా సభ ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగిత్యాలలో జరిగే సభను అడ్డుకునేందుకు రోడ్ల పనులు చేపడుతున్నారని, ప్రజల రాకను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.
సభ ఏర్పాట్లపై మాట్లాడుతూ దాదాపు మూడు లక్షల మంచినీటి బాటిల్స్, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా సాయంత్రం వేళల్లోనే సభ ప్రారంభమవుతుందని, కేసీఆర్ సాయంత్రం 5:30 గంటలకు సభకు చేరుకుంటారని వెల్లడించారు.
ప్రజలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించి సభను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, యువత అందరూ కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సంజయ్, కొప్పుల ఈశ్వర్, విద్యాసాగర్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. జగిత్యాల సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## మియాపూర్‌లో చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**



వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. ప్రభుత్వ రంగంలో వైద్య సౌకర్యాలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ ప్రణయ, డాక్టర్ కె.వి. తేజారెడ్డి పాల్గొన్నారు. వైద్య రంగంలో ఇలాంటి ఆధునిక సౌకర్యాలు పెరగడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

# జగిత్యాల గడ్డపై మళ్లీ జైత్రయాత్ర!

**మొదటిపేజీ తరువాయి**

మళ్లీ అదే సెంటిమెంట్.. అదే జోష్!
తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్‌కు జగిత్యాల అంటే ఒక ప్రత్యేకమైన సెంటిమెంట్. గతంలో ఇక్కడి నుంచే ఆయన చేపట్టిన జైత్రయాత్ర రాష్ట్ర రాజకీయ గమనాన్ని మార్చేసింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న గులాబీ బాస్, ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పదేళ్ల కాలంలో తన హయాంలో జరిగిన అద్భుత ప్రగతిని వివరించడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ సభ సాగనుంది.

**రేవంత్ సర్కార్‌పై అస్త్రశస్త్రాలు**

ఈ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తన వాగ్ధాటిని ప్రదర్శించనున్నారని శ్రేణులు చెబుతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న జాప్యంపై ఆయన విరుచుకుపడే అవకాశం ఉంది. కరెంట్ కోతలు, సాగునీటి కష్టాలు, రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం (రైతుబంధు) నిలిచిపోవడం వంటి అంశాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఇరకాటంలో పెట్టేందుకు కేసీఆర్ వ్యూహరచన చేశారు.

**జీవన్ రెడ్డి చేరికతో మారనున్న సమీకరణలు?**

ఈ సభలో మరో కీలక ఘట్టం చోటుచేసుకోనుంది. కాంగ్రెస్ సీనియర్ నేత టి. జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పట్టున్న నాయకుడు బీఆర్ఎస్ గూటికి చేరడం ద్వారా ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగులుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలోని పలువురు అసంతృప్త నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తుండటం, లోపాయికారీ ఒప్పందాలు జరగడం చర్చనీయాంశంగా మారింది.

**గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం**

జైత్రయాత్ర సభ కోసం బీఆర్ఎస్ నాయకత్వం కళ్లు చెదిరే ఏర్పాట్లు చేస్తోంది. జగిత్యాల పట్టణం మొత్తం గులాబీ తోరణాలతో, భారీ కటౌట్లతో నిండిపోయింది. నియోజకవర్గాల వారీగా జన సమీకరణ బాధ్యతలను ముఖ్య నేతలకు అప్పగించారు. ఈ సభ ద్వారా వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమరానికి సిద్ధం చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. కార్యకర్తల్లో ఉన్న నైరాశ్యాన్ని తొలగించి, మళ్లీ పోరాట పంథాలోకి తీసుకురావడమే ఈ భారీ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం.

**ఆపరేషన్ ఆకర్ష్.. కాంగ్రెస్‌కు చెక్!**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగగా, ఇప్పుడు మళ్లీ పరిస్థితి రివర్స్ అవుతున్నట్లు కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను గమనిస్తున్న ప్రజలు, నాయకులు మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సభ ద్వారా మరికొంతమంది కీలక నేతలు గులాబీ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. 20వ తేదీన జగిత్యాల వేదికగా కేసీఆర్ చేసే ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందోనని రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.



జగిత్యాల సభావేదికను పరిశీలిస్తున్న కేటీఆర్, హరీశ్ రావు, ఇతర ముఖ్యనేతలు...

## కోర్టు ధిక్కరణపై అత్తాపూర్ ఆర్డీవోకు జైలు శిక్ష

- **హైకోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం తీవ్రంగా పరిగణన**
- **పెద్దషాపూర్ భూ వివాద కేసులో కీలక తీర్పు**
- **నెలరోజుల జైలు, జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఆగ్రహం**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:**

కోర్టు ఆదేశాలను గౌరవించకపోవడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందనే సందేశాన్ని స్పష్టంగా ఇస్తూ తెలంగాణ హైకోర్టు అత్తాపూర్ ఆర్డీవో కొప్పుల వెంకట్ రెడ్డికు జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ అధికారుల బాధ్యతలపై న్యాయస్థానం కఠిన వైఖరిని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలోని 74 ఎకరాల భూ వివాదానికి సంబంధించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన యూసుఫుద్దీన్ ఖాన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సంబంధిత భూమిపై తగిన నిర్ణయం తీసుకోవడం లేదని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్డీవోకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లో చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినప్పటికీ, అవి అమలులోకి రాకపోవడం వివాదానికి దారితీసింది.
ఆదేశాలను పట్టించుకోకపోవడంతో పిటిషనర్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయగా, ఈ కేసును జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం విచారించింది. కోర్టు నిర్ణయించిన గడువును ఉల్లంఘించడం తీవ్రంగా పరిగణించబడింది. గడువు ముగిసిన తర్వాత ఆదేశాలను అమలు చేసినప్పటికీ, అది కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది.
కోర్టు ఆదేశాలను సమయానికి అమలు చేయకపోవడం ద్వారా న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిందని ధర్మాసనం అభిప్రాయపడింది. అధికార పదవిలో ఉన్నవారు చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. నిర్లక్ష్యం, ఆలస్యం వంటి కారణాలను కోర్టు సమర్థించబోదని స్పష్టం చేసింది.
ఈ నేపథ్యంలో ఆర్డీవోకు నెల రోజుల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు శిక్షను కూడా అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ తీర్పు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ అధికారులకు ఇది ఒక హెచ్చరికగా నిలిచే తీర్పు అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించడం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా స్పందించడం అత్యవసరమని సూచిస్తున్నారు. న్యాయవ్యవస్థ పట్ల గౌరవం, బాధ్యతతో వ్యవహరించకపోతే ఇలాంటి కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు ద్వారా స్పష్టమవుతోంది.



## తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు వేగం

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను త్వరగా సిద్ధం చేయాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉత్తర తెలంగాణలో రవాణా సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి గతంలో ప్రతిపాదించిన స్థలం అనుకూలంగా లేదని కేంద్రం సూచించిన నేపథ్యంలో కొత్త ప్రదేశాలపై లోతైన అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.
ఈ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో పారిశ్రామిక, పర్యాటక, రవాణా రంగాలకు మరింత ఊతం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి ఈ మౌలిక వసతులు కీలకంగా మారనున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

## రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు


- **బీజేపీతో సంబంధాలపై ఆరోపణలు**
- **ఢిల్లీ ఘటనను ప్రస్తావించిన మాజీ మంత్రి**
- **కాంగ్రెస్ నాయకత్వంపై ప్రశ్నలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 18**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ విధానాన్ని "హైబ్రిడ్ మోడల్ కాదు, కేంద్రంలోని బీజేపీ పెద్దలతో కుదుర్చుకున్న క్రాస్ బ్రీడ్ బంధం"గా ఆయన వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిచ్చిన సమయంలో, రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి భోజనం చేయడం అనుమానాలకు తావిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. ఈ చర్య రాజకీయంగా విరుద్ధ సంకేతాలు ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు ఈ పరిణామాలు తెలుసా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా జరిగే చర్యలపై వారు స్పందిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్పష్టత లేవని, ప్రజలకు భిన్న సంకేతాలు వెళ్తున్నాయని హరీష్ రావు విమర్శించారు. రాజకీయంగా పారదర్శకత అవసరమని, ప్రజలకు నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య విమర్శల యుద్ధం మరింత తీవ్రతరం అవుతున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ప్రతిపాదన

**మొదటిపేజీ తరువాయి**



బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల దేశంలో పెరుగుతున్న ఉక్కు అవసరాలను తీర్చడమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని సీఎం వివరించారు. సంప్రదాయ ఉక్కు పరిశ్రమల వల్ల ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని తగ్గిస్తూ, హైడ్రోజన్ ఆధారిత సాంకేతికతతో గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేయడం ద్వారా సుస్థిర అభివృద్ధికి దోహదం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలు అయితే తెలంగాణ మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తుందని ఆయన స్పష్టం చేశారు.
అదేవిధంగా రాష్ట్రంలో పాత వాహనాల స్క్రాప్‌ను ఉపయోగించి ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ చర్యల ద్వారా వ్యర్థాలను తగ్గించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ఉత్పత్తిలో హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని, ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, నైపుణ్యాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.
హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీ ఆధారంగా గ్రీన్ స్టీల్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఆటోమొబైల్, రక్షణ రంగాలకు అవసరమైన అధునాతన ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరమని, దీనివల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయని వివరించారు.
మెషిన్ టూల్స్, రోబోటిక్స్, ఆటోమేషన్ రంగాల్లో తెలంగాణను హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం జాతీయ స్థాయి శిక్షణ సంస్థలను హైదరాబాద్‌లో స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా యువతకు అత్యాధునిక సాంకేతిక విద్య అందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తయారుచేయవచ్చని తెలిపారు.
హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా మార్చే లక్ష్యంతో పర్యావరణ హిత విధానాలను అమలు చేయాలని సీఎం సూచించారు. వాహనాలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం, శుభ్రమైన ఇంధన వినియోగాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక వృద్ధి ——ఈ మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ముందుకు తీసుకెళ్లే ప్రణాళికలను కేంద్రానికి వివరించారు.
ఈ సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రతిపాదనలు కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబాటు: మహేష్ కుమార్ గౌడ్



- పీసీసీ అధ్యక్షుడి కీలక వ్యాఖ్యలు
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం
- సంక్షేమం, సమానత్వమే లక్ష్యమని స్పష్టం

**హైదరాబాద్, ఏప్రిల్ 18**

తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరిగేలా పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. సామాన్య ప్రజలపై భారం పెంచే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మహిళలు, యువత, రైతుల అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ఎప్పటినుంచో మద్దతు ఇస్తోందని, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సమతుల్యత సాధ్యమవుతుందని వివరించారు.

రైతుల సమస్యలపై కూడా ఆయన స్పందిస్తూ, వ్యవసాయ రంగానికి అనుకూల విధానాలు తీసుకురావాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన మద్దతు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ఎప్పటికీ ముందుంటుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని, సమానత్వం, సంక్షేమం దిశగా ముందుకు సాగుతుందని నాయకులు తెలిపారు.

# 44.6 డిగ్రీల రికార్డు

- తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది..
- ఉదయం నుంచే భానుడి బీభత్సం
- కొమురంభీమ్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత
- ప్రజలకు జాగ్రత్తలు సూచించిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 18**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఉక్కపోతను అనుభవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎంత పెరిగిందో స్పష్టంగా చూపిస్తున్నాయి.

గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఈసారి ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. గత ఏడాది అత్యధికంగా 43.4 డిగ్రీలు నమోదైతే, ఈసారి 44.6 డిగ్రీలకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎండల తీవ్రత కారణంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఎక్కువగా నీరు తాగాలని, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై రక్షణ కోసం టోపీ, గుడ్డలు ఉపయోగించాలని, తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. సూర్యరశ్మి నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండలు మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వేసవి ప్రభావాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

# ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ ఆందోళన

- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- డీఏలు పెండింగ్, సీపీఎస్ రద్దుపై నిర్లక్ష్యం ఆరోపణ
- పెన్షనర్ల పరిస్థితిపై ఆవేదన వ్యక్తం
- మృతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**

తెలంగాణలో ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై బీఆర్ఎస్ నాయకుడు దేవిప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆరోపించారు.

సీపీఎస్ రద్దుపై ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కమిటీ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని దేవిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు సరైన సహాయం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాల వల్లనే ఇప్పటివరకు 86 మంది పెన్షనర్లు మృతి చెందారని ఆరోపించారు.

మృతిచెందిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1.20 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పట్టించుకోకపోతే ఉద్యమాలు మరింత తీవ్రం అవుతాయని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# బాండెడ్ కార్మికుల విముక్తికి ప్రభుత్వం కట్టుబాటు



**హైదరాబాద్, ఏప్రిల్ 18:**

అమీర్‌పేట్‌లోని మ్యారిగోల్డ్ హోటల్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కీలక ప్రకటనలు చేశారు. 2021 నుంచి 2025 మధ్య రాష్ట్రంలో మొత్తం 673 మంది బాండెడ్ కార్మికులను రక్షించామని వెల్లడించారు. బాండెడ్ లేబర్ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. బాధితులను గుర్తించి వారిని విముక్తి చేయడమే కాకుండా, పునరావాసం కల్పించడంలో కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి దుర్భర పరిస్థితులను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతర చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా 24 గంటలపాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 8069434343ను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఎవరైనా బాండెడ్ కార్మికుల సమస్యలను గమనిస్తే వెంటనే ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

బాధితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. జీవనోపాధి అవకాశాలు, నివాస సౌకర్యాలు కల్పించడం ద్వారా వారికి గౌరవప్రదమైన జీవితం అందించడమే లక్ష్యమని వివరించారు. బాండెడ్ కార్మిక వ్యవస్థ సమాజానికి మచ్చగా నిలుస్తోందని, దీనిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం, అధికారులు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. బాధితుల పునరావాసం, అవగాహన కార్యక్రమాలు మరింతగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో అధికారులు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బాండెడ్ కార్మికుల నిర్మూలనలో సమిష్టి కృషి అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

# ఫేక్ పార్సిల్ కాల్స్‌పై తెలంగాణ పోలీసుల హెచ్చరిక

- మాదక ద్రవ్యాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి




**హైదరాబాద్, ఏప్రిల్ 18**

ఫేక్ పార్సిల్ కాల్స్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై తెలంగాణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల "మీ పేరుతో పార్సిల్‌లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి" అంటూ కాల్స్ చేసి భయపెట్టి డబ్బులు దోచుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు.

ఈ మోసాల్లో భాగంగా కేటుగాళ్లు పోలీసులుగా, కస్టమ్స్ అధికారులుగా నటిస్తూ బాధితులను భయపెడుతున్నారు. మీ ఆధార్, వివరాలతో పార్సిల్ బుక్ అయిందని చెప్పి, వెంటనే చెల్లింపులు చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. భయాందోళనలకు గురైన కొందరు ప్రజలు డబ్బులు చెల్లించి మోసపోతున్న ఘటనలు నమోదవుతున్నాయి. ఇలాంటి కాల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని పోలీసులు సూచించారు. ఫోన్ ద్వారా ఎవరైనా డబ్బులు అడిగితే అది మోసమేనని గుర్తించాలన్నారు. ముఖ్యంగా అపరిచిత నంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్ లేదా ఫోన్ కాల్స్‌లో వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు.

ప్రజలు ఈ తరహా మోసాల నుంచి రక్షణ పొందాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు తెలిపారు. తెలియని లింక్‌లు ఓపెన్ చేయకూడదు, ఎవరైనా ఒత్తిడి తీసుకొస్తే వెంటనే కాల్ కట్ చేయాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్ వస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త రూపాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అవగాహనతోనే మోసాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ విషయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఫేక్ పార్సిల్ కాల్స్ వంటి మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండి తమ ఆస్తులను, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నాచారం పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం

- గిడ్డంగిలో మంటలు.. సరుకు పూర్తిగా దగ్ధం
- అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమ
- ప్రాణనష్టం లేదు.. కారణాలపై దర్యాప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 18**



హైదరాబాద్ నగరంలోని నాచారం పారిశ్రామిక వాడలో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై తాజా వివరాలు వెలుగులోకి వచ్చాయి. నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న గిడ్డంగిలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

ప్రమాదం సమయంలో గిడ్డంగిలో ఉన్న సరుకు మొత్తం మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. మంటల తీవ్రత కారణంగా దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసి పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అగ్ని వ్యాప్తి పక్కనే ఉన్న ఇతర యూనిట్లకు కూడా విస్తరించినట్లు సమాచారం.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. కొంతసేపటి పాటు మంటలు అదుపులోకి రాకపోవడంతో అనేక ఫైర్ ఇంజిన్లు వినియోగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంటలను అదుపులోకి తీసుకురావడానికి సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు.

ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ప్రమాదం కారణంగా నాచారం-చిలుకానగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేసి, ఇతర మార్గాలకు మళ్లించారు. ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనతో నాచారం పారిశ్రామిక వాడలో భద్రతా చర్యలపై మరోసారి చర్చ ప్రారంభమైంది. పరిశ్రమల్లో అగ్ని భద్రత ప్రమాణాలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఎన్నికల బందోబస్తుకు వెళ్తున్న హోమ్ గార్డులకు కిట్ల పంపిణీ

- సంగారెడ్డి జిల్లా పోలీసుల ప్రత్యేక ఏర్పాట్లు
- ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం
- ఎస్పీ పరితోష్ పంకజ్ సూచనలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 18:**

తమిళనాడు సాధారణ ఎన్నికల బందోబస్తు విధులకు వెళ్తున్న 38 మంది హోమ్ గార్డ్ సిబ్బందికి సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ మెడికల్ మరియు అవసరాల కిట్లను పంపిణీ చేసింది. విధుల్లో పాల్గొనే సిబ్బంది ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ విధుల్లో ఉండే ప్రతి సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికల బందోబస్తు వంటి బాధ్యతాయుత పనుల్లో అప్రమత్తతతో పాటు ఆరోగ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. పంపిణీ చేసిన కిట్లలో ప్రాథమిక ఔషధాలు, బిస్కెట్లు, తక్షణ అవసరాలకు ఉపయోగపడే సామగ్రిని అందించారు. దీర్ఘకాల విధుల్లో అలసటను తగ్గించడంలో, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనడంలో ఇవి ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి వెళ్లే సిబ్బంది క్రమశిక్షణ, సమర్థతతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. విధుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. హోమ్ గార్డులు పోలీస్ శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు శాంతి భద్రతల పరిరక్షణలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం తమ బాధ్యత అని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే హోమ్ గార్డులకు అందించిన ఈ సహాయం వారికి ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

- దక్షిణాది రాష్ట్రాల మద్దతు కోసం ముందుకు వస్తానన్న సీఎం
- డీలిమిటేషన్ పేరుతో కుట్రలు చేస్తున్నారని బీజేపీపై ఆరోపణలు
- మహిళా సాధికారతపై కాంగ్రెస్ కట్టుబాటు పునరుద్ఘాటన

**ఢిల్లీ, ఏప్రిల్ 18:**




మహిళా రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత వ్యాఖ్యలు చేశారు. 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలోపు మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తే తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడాన్ని దేశ ప్రయోజనాల దృష్ట్యా ఒక ముఖ్య పరిణామంగా అభివర్ణించారు. ఇది కేవలం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు. దేశ సమగ్రతను కాపాడటంలో ఈ పరిణామం కీలకమైందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలు చేసి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకమైందని తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నించడం ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో ఎలాంటి అడ్డంకులు లేవని, చిన్న సవరణలతో వెంటనే అమలు చేయవచ్చని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా రిజర్వేషన్లు ఉండాలని డిమాండ్ చేశారు. ఇది సమగ్ర సామాజిక న్యాయానికి అవసరమని పేర్కొన్నారు.

బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచి శాశ్వత అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి ముప్పు అని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే ప్రవేశపెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇస్తుందని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కనబెట్టి కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారత కాంగ్రెస్ సిద్ధాంతాల్లో ప్రధాన భాగమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ వంటి నాయకత్వం దేశానికి మార్గదర్శకమైందని గుర్తుచేశారు. బీజేపీ నుంచి ఇప్పటివరకు మహిళా అధ్యక్షురాలు లేకపోవడం వారి మహిళా దృక్పథాన్ని చూపిస్తుందని విమర్శించారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం సమాజ పురోగతికి అవసరమని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక అడుగు అవుతుందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడుతూ, సమాన అవకాశాలు కల్పించే విధంగా కేంద్రం ముందుకు రావాలని ఆయన కోరారు. దేశ సమగ్రత, సమాన అభివృద్ధి లక్ష్యంగా అన్ని నిర్ణయాలు ఉండాలని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
శ్రీ తొలిక్రాంతి
SRITHOLIKRANTHI



సంపాదకీయం

# మోదీ సర్కారుకు గుణపాఠం

## విపక్షాల ఐక్యతతో 'సవరణ'కు బ్రేక్!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్మాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినెట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్



**చెన్నై, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీకి ఊరట

### పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టు స్టే



**ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 17:** పౌరసత్వ వివాదంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టు శనివారం స్టే విధించింది. శుక్రవారం రాహుల్‌పై విచారణకు ఆదేశించిన అదే లక్నో బెంచ్, నేడు ఆ నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ గాంధీ బ్రిటీష్ పౌరసత్వం కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని జస్టిస్ సుభాష్ విద్యార్థి నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం మౌఖికంగా ఆదేశించింది. అయితే, ఈ తీర్పు కాపీపై సంతకం చేసే ముందే కోర్టు తన నిర్ణయాన్ని సమీక్షించుకుంది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (రాహుల్ గాంధీ) వాదన వినకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2014 నాటి ఒక ఫుల్ బెంచ్ తీర్పును ఉటంకిస్తూ, నిందితుడికి నోటీసులు ఇచ్చి వివరణ కోరడం తప్పనిసరని కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విగ్నేష్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. 2003-2009 మధ్య లండన్‌లోని 'బ్యాక్ ఆప్స్ లిమిటెడ్' అనే కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రాహుల్ గాంధీ తనను తాను బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నారని, ఇది భారత రాజ్యాంగం ప్రకారం చట్టవిరుద్ధమని ఆయన వాదన.

# బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

### నలుగురు అనుమానితుల అరెస్టు

**న్యూఢిల్లీ:** సున్నితమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరిపేందుకు రెక్కీలు నిర్వహిస్తూ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా ఇతరులను రిక్రూట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. నిఘా ఆధారిత ఆపరేషన్ ద్వారా ఇద్దరు నిందితులు మోసైబ్ అహ్మద్, హహమ్మద్ హమాద్‌ను మహారాష్ట్రలో, షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తిని ఒడిశాలో, మహమ్మద్ సోహైల్‌ను బిహార్‌లో అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిని ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు తయారీకి యత్నిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు నిందితులు తీవ్రవాద భావజాలంతో ప్రభావితమైనట్టు అధికారులు తెలిపారు. నిందితులలో ఒకడు ఎర్రకోట తమలక్ష్యమని తెలిపే సంకేతంతో నల్లజెండాతో కూడిన ఎర్రకోట మార్ఫింగ్ ఫోటోను షేర్ చేసినట్టు గుర్తించామని చెప్పారు. షేక్ ఇమ్రాన్ అనే నిందితుడు 2025లో ఎర్రకోట, ఇండియా గేట్ సహా కీలక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించినట్టు తెలిపారు. మోసైబ్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఆటో ఎలక్ట్రీషియన్‌గా పనిచేశాడని, ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ కారు డిజైన్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యం అతనికి ఉందని గుర్తించా మని వివరించారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి నిందితుల నెట్‌వర్క్ ఛేదించేం దుకు, ఇతర ముఠాలతో సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



# హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

### భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!

### మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ దట్టంగా కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. శుక్రవారం జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దిగ్బంధన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేయడంతో గంటల వ్యవధిలోనే మళ్లీ జలమార్గంపై ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో శనివారం జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) గన్‌బోట్లు కాల్పులకు పాల్పడటం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఇరాక్ నుంచి సుమారు రెండు మిలియన్ బ్యారెల్ల ముడి చమురును భారత్‌కు తీసుకువస్తున్న ఒక భారత జెండా కలిగిన సూపర్ ట్యాంకర్‌తో పాటు మరో వాణిజ్య నౌకపై ఇరాన్ సైన్యం కాల్పులు జరిపినట్లు 'ట్యాంకర్ ట్రాకర్స్' సంస్థ ధృవీకరించింది. ఓమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ముందస్తు రేడియో హెచ్చరికలు లేకుండానే ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరపడంతో, సదరు నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి మళ్లాయి. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో నౌకలకు గానీ, అందలి సిబ్బందికి గానీ ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని సమాచారం అందింది. ఇరాన్ తన ఓడరేవులను తెరుస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, అమెరికా మాత్రం ఇరాన్‌పై తన నావికా దళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. "అమెరికా తన పద్ధతి మార్చుకోనంత వరకు హోర్ముజ్ జలసంధి తమ సైనిక నియంత్రణలోనే ఉంటుంది" అని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు సరఫరా చేసే భారత్‌కు చెందిన మరికొన్ని నౌకలు కూడా తమ ప్రయాణాన్ని నిలిపివేసి సురక్షిత ప్రాంతాలకు మళ్లాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు హోర్ముజ్ జలసంధి నుండే వెళ్లాల్సి ఉంటుంది. తాజా కాల్పుల ఘటనతో అంతర్జాతీయ చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రయత్నాలు జరుగుతున్నా, మరోవైపు ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా కనిపిస్తోంది. ప్రస్తుతానికి భారత విదేశాంగ శాఖ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.

శ్రీ తొలిక్రాంతి
RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
SRITHOLIKRANTHI
సామాన్యుడి ఆయుధం.. తొలిక్రాంతి అక్షరం



# వాహన తనిఖీల్లో ఉల్లంఘనలు వెలుగులోకి
# చట్టాల అమలుపై సీఐ హెచ్చరిక

**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**



దేశంలో చట్టాలు కఠినతరం అవుతున్నా అమలు విషయంలో "జీరో ఎన్ఫోర్స్‌మెంట్" పరిస్థితి నెలకొంటోందని సీఐ నాగరాజు రెడ్డి పేర్కొన్నారు. చట్టాలు పుస్తకాలకే పరిమితమవడం, పాటించకపోవడం సమాజానికి ముప్పుగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను సీఐ నాగరాజు రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ యయాతి రాజు, ఎస్ఐ అఖిల ఆధ్వర్యంలో చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను నిలిపి తనిఖీ చేసి అవగాహన కల్పించారు.హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిబుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం వందకు పైగా వాహనాలు తనిఖీ చేయగా, సుమారు 50 వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడం గుర్తించారు. చట్టం అమల్లో ఉంటేనే ప్రజలకు రక్షణ లభిస్తుందని, లేకపోతే చట్టాల ఉద్దేశం నెరవేరదని సీఐ నాగరాజు రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐ యయాతి రాజు, ఎస్ఐ అఖిల కఠినంగా తనిఖీలు నిర్వహించి నియమాలపై అవగాహన కల్పించారు.




## జలగం వెంకటరావు జన్మదిన వేడుకలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- అభిమానుల కేక్ కట్ సేవా కార్యక్రమాలు
- వృద్ధాశ్రయము నందు భోజన ఏర్పాట్లు

**ఖమ్మం, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సర్దార్ జలగం వెంగళరావు తనయులు, సత్తుపల్లి, కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు జలగం వెంకటరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ నియోజక వర్గాలు, మండలాలు, గ్రామాలు, పట్టణాలు, పల్లెలన్నీ సంబరాల వాతావరణంలో మునిగిపోయాయి.జలగం అభిమానులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. జలగం సేవలు తరం తరం నిరంతరం అంటూ కొనియాడుతూ జలగం అంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బ్రాండ్ అని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా అనేక ఆసుపత్రుల్లో సేవా కార్యక్రమాలు, వృద్ధాశ్రయము నందు భోజన ఏర్పాట్లు వంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఫ్లెక్సీలు, నినాదాలతో జిల్లా అంతా జలగం వెంకటరావు పేరు మారుమోగింది. జన్మదిన వేడుకలు ఉత్సాహంగా సాగుతుండగా, అభిమానులు ఎల్లప్పుడూ జలగం కుటుంబం వెంటే ఉంటామని నినాదాలు చేశారు. మరిన్ని పుట్టినరోజులు ఇలాగే జరుపుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.






## ముత్యాలమ్మ దర్శనం

- తిరునాళ్లలో మెచ్చా పాల్గొనడం

**దమ్మపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

దమ్మపేట మండల కేంద్రంలో ప్రారంభమైన ముత్యాలమ్మ అమ్మవారి 29వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోంది. కమిటీ, గ్రామస్థుల ఆహ్వానం మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు తిరునాళ్లలో పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి కొంతసేపు గడిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో "దీపు" రావు జోగేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, పసుమర్తి కుసుమాంబ, దారా రాము, అబ్దుల్ జిన్నా, కాసిని శ్రీను, పసుమర్తి సుదర్శన్ రావు, మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్, దండాబత్తుల కాంతారావు, ప్రకాశ్, సుబ్బారావు, మండవ సత్య, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.



## పొంగులేటికి మహా కుంభాభిషేక ఆహ్వానం



**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వచ్చే నెల 6వ తేదీ నుండి అత్యంత వైభవంగా నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను హైదరాబాద్ సెక్రటేరియట్‌లో రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ మహోత్సవాలు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడనున్నాయి. మహా కుంభాభిషేకం ద్వారా ఆధ్యాత్మిక అభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు కలుగుతాయని, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు.అన్నపురెడ్డిపల్లి ప్రాంతానికి ఈ మహోత్సవం ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే కాకుండా భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తుందని ప్రముఖులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ సభ్యులు కాలోజీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహానికి చిరునామా నరసింహ



- పోలీసు అధికారికి సత్కారం

**సత్తుపల్లి, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

సత్తుపల్లి మండలం గంగారం పోలీస్ బెటాలియన్‌లో 5 సంవత్సరాల పాటు సహా కమాండెంట్‌గా సేవలందించిన నరసింహ హైదరాబాద్ బెటాలియన్‌కు బదిలీ అయిన సందర్భంగా విశ్వశాంతి విద్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, నరసింహ తాను విధులు నిర్వహించిన ప్రతిచోటా పోలీస్ సిబ్బంది, అధికారులుతో మాత్రమే కాకుండా ప్రజలతో కూడా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ ఆదర్శంగా నిలిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నరసింహ ని శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, ఆయన సేవలను అభినందించారు.

## కోఆప్షన్ పదవికి ఎండీ గౌస్ వైపు మొగ్గు

- నలుగురు పోటీలో కొనసాగుతున్న ఆశావహులు
- మూడు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం
- నాయకులు కార్యకర్తల మద్దతు
- నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర

**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**



అశ్వారావుపేట మున్సిపల్ కోఆప్షన్ సభ్యుని ఎంపిక ప్రక్రియ నియోజకవర్గంలో ఆసక్తి రేపుతోంది. ఈ ప్రతిష్టాత్మక పదవి కోసం ప్రస్తుతం నలుగురు ఆశావహులు పోటీలో ఉన్నారు.అయితే మెజారిటీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల మద్దతు సీనియర్ నాయకుడు ఎండీ గౌస్ వైపే కనిపిస్తోంది.గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ వస్తున్న ఎండీ గౌస్, పార్టీ కష్టకాలాల్లో కూడా వెనకడుగు వేయకుండా పనిచేశారు. వృత్తిరీత్యా ఆర్ఎంపీ డాక్టర్ అయిన ఆయన సామాన్య ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటంతో ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌లకు గౌస్ సన్నిహితుడిగా ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంటున్నారు.నియోజకవర్గ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఎండీ గౌస్ వైపే ప్రజలు, కార్యకర్తలు మొగ్గు చూపుతున్నారు. మున్సిపల్ అభివృద్ధిలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. త్వరలోనే కోఆప్షన్ సభ్యునిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



## జాతీయ స్థాయిలో సాయిస్ఫూర్తి విద్యార్థుల సత్తా

- ముగ్గురు విద్యార్థులకు జాతీయ జట్టు అవకాశం

**సత్తుపల్లి, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు వాలీబాల్‌లో ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, తెలంగాణ తరపున జాతీయ స్థాయికి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కేరళలో జరిగిన 5వ దక్షిణాది రాష్ట్రాల నేషనల్ పాలిటెక్నిక్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని జట్టు మూడవ స్థానం సాధించింది. నవనీత్ కృష్ణ, కిరణ్ వాసు, భవాని వరప్రసాద్ ఈ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

## యువకుడి అనుమానాస్పద మృతి

- షెడ్డులో ఉరి వేసుకున్న ఘటన

**బోనకల్, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**




బోనకల్‌కు చెందిన గొర్రెల కాపరి విజయకుమార్ కుమారుడు నల్లబొతుల కార్తికేయ (19) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం 17-04-2026 రాత్రి కార్తికేయ తన స్నేహితులు ముంగి నాగరాజు, తాటి సైదులు @ అన్నమయ్య, కొమ్మినేని రాంబాబులతో కలిసి మద్యం సేవించి రాత్రి 11 గంటల ప్రాంతంలో వారి వారి ఇళ్లకు వెళ్లిపోయారు. మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటల సమయంలో వారు అద్దెకు తీసుకున్న రేకుల షెడ్డులో కార్తికేయ ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడు. ఈ విషయాన్ని మొదట గమనించిన నాయనమ్మ పద్మ కేకలు వేయడంతో తండ్రి విజయకుమార్, తాత రామరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. మరణానికి గల కారణాలు ఇంకా స్పష్టత రాలేదు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద క్రైమ్ నెం. 68/2026 నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్షకు తరలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

## త్రివేణికి ఆర్థిక సహాయం



- అత్యవసర శస్త్రచికిత్సకు స్పందించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన వీరబోయిన త్రివేణి (తండ్రి మోహన్ రావు) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అత్యవసర శస్త్ర చికిత్స అవసరం కావడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వ సహాయంతో 75,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ఆ సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేసి త్రివేణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జనగణన శిక్షణ కార్యక్రమం

- అశ్వారావుపేట రైతు వేదికలో నిర్వహణ

**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (శ్రీ తొలి క్రాంతి):**

ఏప్రిల్ 16 నుండి ప్రారంభమైన 2027 జనగణన మొదటి దశలో భాగంగా అశ్వారావుపేట రైతు వేదిక నందు శనివారం 38 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఫీల్డ్ ట్రైనర్లు డి నరసింహారావు, ఎన్ అశోక్ బాబు జనగణన ప్రక్రియలో చేపట్టాల్సిన అంశాలపై ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీఓ ఉదయభాస్కర్, ఛార్జ్ ఆఫీసర్ తహసిల్దార్ దాసరి కిషోర్, ఛార్జ్ క్లర్క్ కే రాము, టెక్నికల్ అసిస్టెంట్ టి రామకృష్ణ పాల్గొన్నారు.



RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
శ్రీ తొలిక్రాంతి
SRITHOLIKRANTHI



# అలుపెరుగని పోరాట యోధుడు 'సర్దార్' గౌతు లచ్చన్న!

## జమీందారీ వ్యతిరేక పోరాటంలో అగ్రగామి

### స్వాతంత్ర్యోద్యమం నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు అలుపెరుగని ప్రస్థానం

## నేడు జననేత గౌతు లచ్చన్న వర్ధంతి

**భారతదేశ చరిత్రలో 'సర్దార్' అనే గౌరవ నామంతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నేతలు ఇద్దరే. ఒకరు దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయి పటేల్ అయితే, మరొకరు ఆంధ్రుల ఆరాధ్య దైవం సర్దార్ గౌతు లచ్చన్న. సాహసానికి, కార్యదక్షతకు నిలువుటద్దంగా నిలిచిన లచ్చన్న, తన జీవితాంతం పీడిత వర్గాల పక్షాన నిలబడి పోరాడిన ధీశాలి. ఏప్రిల్ 19న ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకోవడం మనందరి బాధ్యత.**

### స్వాతంత్ర్య సమరంలో సైనికుడిగా:

శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా బారువా గ్రామంలో 1909, ఆగస్టు 16న ఒక సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన లచ్చన్న, కేవలం 21 ఏళ్ల ప్రాయంలోనే గాంధీజీ పిలుపుతో చదువును వదిలి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి కార్యక్రమాల్లో పాల్గొని పలుమార్లు జైలు శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను 'అతి ప్రమాదకరమైన వ్యక్తి'గా గుర్తించి, పట్టిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతి ప్రకటించిందంటే ఆయన పోరాట పటిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

### జమీందారీ వ్యతిరేక పోరాటం - కిసాన్ ఉద్యమం:

జమీందార్ల అరాచకాలను ఎదిరించి రైతులకు అండగా నిలవడంలో లచ్చన్న అగ్రగామిగా నిలిచారు. ఆచార్య రంగాతో కలిసి కిసాన్ ఉద్యమాలను నడిపి, జమీందార్ల పక్కల్లో బల్లెంగా మారారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేస్తూ హరిజన సేవా సంఘాలను స్థాపించారు. హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించడమే కాకుండా, పేద విద్యార్థుల చదువుల కోసం ఆర్థిక సహాయం అందించి ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి కారణమయ్యారు.

### రాజకీయ ప్రస్థానం - సిద్ధాంతాలకు కట్టుబడి:

టెంకాయ చెట్టు గుర్తుపై స్వతంత్ర పార్టీని నడిపిన లచ్చన్న, రాజీలేని రాజకీయం చేశారు. ప్రకాశం పంతులు మరియు బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. అయితే, మద్యపాన నిషేధం వంటి ఆశయాల విషయంలో ఏకంగా ప్రభుత్వం పతనానికి కారణమైనా వెనకాడలేదు. చిన్న రాష్ట్రాల ఏర్పాటును బలంగా ఆకాంక్షించిన ఆయన, మర్రి చెన్నారెడ్డితో కలిసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గళమెత్తారు. తెలంగాణ ఆవశ్యకతపై పుస్తకాన్ని కూడా రచించి తన మద్దతును చాటుకున్నారు.

### ముగిసిన శకం - మారని జ్ఞాపకం:

కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజా శ్రేయస్సు కోసమే రాజకీయాలు చేసిన లచ్చన్న, చివరి దశలో పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి అంకితమయ్యారు. 2006, ఏప్రిల్ 19న ఈ అలుపెరుగని పోరాట యోధుడు కన్నుమూశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన నేర్పిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

# సామాజిక సంస్కర్త పరశు రాముడు

## అక్షయ తృతీయ పరశురాముని జయంతి



**నేడు బెంజమిన్ ఫ్రాంక్లిన్ వర్ధంతి**

(రామ కిష్టయ్య సంగనభట్ల, 9440595494)

భృగు వంశోద్భవుడు, జమదగ్ని మహర్షి కుమారుడు, సహస్ర బాహు డైన కార్త వీర్యార్జునుని సంహరించిన, మహా వీరుడు పరశు రాముడు. తండ్రి ఆజ్ఞానువర్తియై, కన్నతల్లిని హతమార్చి, తిరిగి తండ్రి ఆశీస్సులతో, పునరుజ్జీవితు రాలిగా చేసిన ధర్మవీరుడు. భూ భారాన్ని తగ్గింప, భార్గవ రాముని రూపంలో ఉదయించాడు శ్రీహరి. అనులోమ సంజాతుడు అయి, బ్రాహ్మణుడగు జమదగ్నికి, క్షత్రియురాలగు రేణుకకు జన్మించి బ్రాహ్మణ, క్షత్రియ వివాదాలను గొడ్డలితో తీర్చి, ఆటవికులకు యజ్ఞోపవీత ధారణ గావించి, బ్రాహ్మణులుగా మార్చిన అసామాన్య సామాజిక సంస్కర్త పరశు రాముడు. అంతేకాదు బ్రాహ్మణ పక్షపాతియై, క్షత్రియులను అనేకులను సహకరించిన పరశు రాముడు, "మీరెన్ని దానములు పట్టినను, ఎంతగా కష్టపడిననూ, విద్య వచ్చును గాని, ధనము రాదని, వచ్చిననూ అది నిలువ ఉండదని", బ్రాహ్మణ కులానికి శాపమిచ్చినట్లుగా కథనం ఉంది. ఆజన్మాంతం క్షత్రియ కులాన్ని నిర్మూలించిన పరశు రాముడు, క్షత్రియుడు అయిన శ్రీరాముని చేతిలో ఓడిపోవడం, శివ ధనుస్సు విరిచి, వివాహితుడై వస్తున్న దశరథ రాముని, ఎదిరించి, భంగ పడడం, విష్ణువు యొక్క ఒక ఒక అవతారం చేత, మరొక అవతారం ఓడింప బడిన సందర్భం ప్రత్యేకం. పరశు రామా! దశరథ రాముడి సందర్శనం అయ్యాక, నీవు శస్త్రం పట్టవద్దు. ఎందుకంటే నీ వైష్ణవ తేజస్సు అతనిలో ప్రవేశిస్తుంది. అది సురకార్యం నిర్వహిస్తుంది. అని శంకరుడు పరశు రామునికి లోగడ చెప్పడమే దీనికి కారణం అని పురాణ కథనం.

విష్ణువు దశావతారాలలో ఆరవది పరశు రామావతారం. పురుషార్థ చంద్రిక, నిర్ణయ సింధు, గ్రంథాలు అక్షయ తృతీయ "పరశురామ జయంతి" పేర్కొంటున్నాయి. శ్రీకృష్ణుని, శ్రీరాముని జయంతులు, జరుపుకుంటున్న విధంగా, పరశు రామ జయంతిని కూడా జరపాలని శాస్త్ర వచనం. పరశు రాముడు చిన్నతనంలో తన తండ్రి పితామహుడైన భృగు మహర్షి ఆశ్రమానికి వెళ్లగా, ఆ బాలకుని తేజస్సుకు తాళలేక, భృగు మహర్షి కళ్ళు మూసుకొని, ఆ బాలకుని హిమాలయాలకు వెళ్లి తపమాచరించిన మని సూచించాడు. బాలకుని తపస్సుకు, శివుడు ప్రత్యక్షమై, "నీవు ఇంకా చిన్నవాడివి, రౌద్రాస్త్రాలు, భరించే శక్తి నీకు లేదని కొంతకాలం తీర్థయాత్రలు చేయాలని", హితవు పలికాడు. తీర్థయాత్రలు పూర్తిచేసుకుని, తిరిగి తపస్సు ప్రారంభించగా, ఆ సమయంలో రాక్షస బాధలు తాళలేక, ఇంద్రాది దేవతలు శివుని శరణు వేడగా, భార్గవ రామునికి, పరమ శివుడు, "పరశువు" అనే గండ్రగొడ్డలి ఇచ్చి రాక్షసుల పైకి పంపడం చేత పరుశురామ నామాంకితుడైనాడు. అలా స్వర్గంలో రాక్షసులను లేకుండా చేశాడు. ఓ సందర్భంలో పరశు రాముడు, శివుని దర్శించబోగా ద్వారం వద్ద వినాయకుడు అడ్డగించాడు. కోపంతో పరశు రాముడు తన పరశువును విసిరేశాడు. తన తండ్రి శివుని ప్రసాదమైన పరశువుపై గౌరవంతో వినాయకుడు ఆ పరశువుతో తన దంతం విరిగేలా సమర్పించు కొన్నాడు.

ఒకనాడు తల్లి రేణుక, నీళ్ళు తేవడానికి ఏటికి వెళ్లి అక్కడ చిత్రరథుడనే, గంధర్వ రాజు కుమారుడు, తన భార్యతో జలవిహారం చేయడాన్ని చూసి, తనకు అలాంటి అదృష్టం లేదని చింతిస్తూ, ఆశ్రమానికి ఆలస్యంగా వెళ్ళింది. ఆమె ఆలస్యానికి కారణం తెలుసుకున్న జమదగ్ని, కళంకితయైన, తల్లిని ఖండించాలి అని కుమారులను కోరాడు. ముగ్గురు మొదటివారు ఒప్పుకోని స్థితిలో, నాలుగవ వాడైన పరశు రాముడు తండ్రి ఆజ్ఞను శిరసా వహించి, ఆమెను ఖండించాడు. అప్పుడు తండ్రి, పరశురాముని ఏదైనా వరం కోరుకోమనగా, తనకు మాతృ భిక్ష పెట్టమని ప్రార్థించాడు. అలా రేణుక పునరుజ్జీవితురాలు అయింది. తండ్రి ఆశ్రమంలో లేని సమయాన కార్తవీర్యార్జునుడు అనే రాజు కామధేనువు "సురభి" ని బలవంతంగా తీసుకు పోగా, పరశురాముడు, ఆ రాజును



హతమార్చి, తిరిగి తెచ్చాడు. అందుకు పగబట్టిన కార్తవీర్యార్జునుని కుమారులు, జమదగ్నిని హత మార్చగా, తిరిగివచ్చిన పరశు రాముడు, విషయం తెలుసుకుని, వారి మీదికి దండెత్తి, గర్భస్థ పిండాలను కూడా వదలక చంపాడు. వారి నెత్తుటితో పితృ తర్పణం గావించాడు. పరశు రాముడు యావత్ క్షత్రియ జాతిపై ఆగ్రహించి వారిపై 21 మార్లు దండెత్తి క్షత్రియ వంశాలను నాశనం చేశాడు. శ్యమంతక పంచకమనే 5 సరస్సులను క్షత్రియుల రక్తంతో నింపి పరశు రాముడు తల్లి దండ్రులకు తర్పణం అర్పించాడు.

ఇలా అందరినీ హతమార్చడం చేత భూమి అంతా పరశు రాముని వశం అయింది. యజ్ఞం చేసి భూమి అంతయు బ్రాహ్మణులకు దానం చేశాడు. అశ్వమేధయాగం చేసి ఆ భూమిని కశ్యపుడికి దానంగా ఇచ్చాడు. అప్పటి నుండి భూమికి 'కశ్యపి' అనే పేరు వచ్చింది. దానం ఇచ్చిన నేలపై ఉండ కూడదని, బ్రాహ్మణులు అనగా... పరశు రాముడు సముద్రం వద్దకు వెళ్లి, తన స్రువమును, సముద్రం లోనికి విసిరి వేయగా, రెండు యోజనాల దూరంలో పడగా, సముద్రుడు ఆ ప్రదేశం నుండి ఉపసంహరించు కున్నాడు. దానినే కొత్తగా ఏర్పడిన "మలబారు" ప్రాంతంగా చెబుతారు. అక్కడే పరశు రాముడు నివసించగా, ఆయన ఉన్న చోట కరువు ఉండదని, వజ్రోత్సవ చంద్రికలో పేర్కొన బడింది.

"అబ్రహ్మణ్యే తథా దేశే కైవర్తాన్ ప్రేక్ష భార్గవ: స్థావయిత్వా స్వకీయే సక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్"..స్కంధ పురాణం ఆధారంగా, కశ్యప బ్రాహ్మణునిచే వెడల కొట్టబడిన వాడైన పరశు రాముడు, సహ్యాద్రి పర్వత ప్రాంతమందు నివసించి, అక్కడి ఆటవికమైన కొండ జాతి వారికి జంధ్యములు వేసి బ్రాహ్మణులుగా మార్చినట్లు వివరించ బడింది. పరశు రాముడు 'కైవర్తా' ఆటవికులను బ్రాహ్మణులుగా గుర్తించడం వల్లనే కాబోలు - కొన్ని జాతుల వారికి 'రేణుకాదేవి యిలవేల్పయినది

# అక్షయ ఫలాన్ని ఇచ్చేది తృతీయ

(రామ కిష్టయ్య సంగనభట్ల, 9440595494)



హిందువుల పండుగలలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నది అక్షయ తృతీయ. వైశాఖ శుద్ధ తృతీయ నాడు చేసే దానాలు దేవతల, పితృదేవతల గురించి చేసే పూజలు, అక్షయ ఫలాన్ని ఇస్తాయని, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. తీర్థ స్నానం, తిలలతో పితృ తర్పణం, ఘట దానం, దైవ పూజలు, ఈ దినాన దానం చేయడం అనాదిగా ఆచరణలో ఉంది. నదీస్నానం దానం, తపం, శ్రాద్ధం, హోమం చేయాలని వ్రత గ్రంథాలలో ఉంది. అక్షయ తృతీయనాడు పెరుగు అన్నం, విసనకర్రలు, గొడుగులు, పాదుకలు, చెప్పులు, ఉద కుంభం, మున్నగు వాటిని దానం చేయాలని చెప్పబడింది. ఎండలు మెండుగా ఉండే వైశాఖ మాసంలో కుండలలో, జాగ్రత్తగా పెట్టిన నీటిని త్రాగితే, దాహ శాంతి కరంగా ఉండగలదని, మతపెద్దల నిర్ణయానుసారం, నీటితో నిండిన పాత్రలను, కుండలను ( ఉదకుంభ) దానం చేయడం ఆచారంగా మారింది. ఈ రోజున, విష్ణుపూజ లక్ష్మీ నారాయణ రూపంలో చేయాలని, పురుషార్థ చింతామణి యందు పేర్కొనబడింది. గౌరీ పూజ గౌరీ వ్రతం పేరున పూజ చేయడం కొన్ని ప్రాంతాలలో, ఆలయాలలో ఆచారంగా ఉంది. ఆహవనీయ, గార్హపత్య, దక్షిణములు అనబడే త్రేతాగ్నులు పూజింపబడిన కాల మగు 196 వేల మానవ సంవత్సరాల క్రితం త్రేతా యుగానికి, ఇది తొలి రోజుగా, యుగాదిగా భావించబడుతున్నది. వైశాఖ శుక్లపక్ష తదియ బలరామ జయంతిగా పంచాంగాలు పేర్కొంటున్నాయి. తాటిచెట్టును కేతనం మీద నిలుపుకొని, తమకు సాధనమైన, నాగలిని ఆయుధంగా కలిగి, తమను హర్ష కులుగా చేసిన, బలరాముని జయంతి దినమైన, అక్షయ తదియ తెలుగునాట కర్షకుల కార్యకలాపాలకు, ముఖ్య కేంద్రంగా మారింది. అందుకే ఈ ప్రాంతం కర్షకులు, తమ పొలాలలో గృహస్తులు తమ పెరళ్ళలో, ఏ రోజున కూర పాదులు కట్టడం కూడా సనాతన ఆచారంగా మారింది. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైన, అక్షయ తృతీయ నాడు బంగారం కొనుగోలు చేసి, దాచి ఉంచితే, సంపద ఇతోధికంగా వృద్ధి కాగలదనే విశ్వాసంతో, అక్షయ తృతీయ రోజున, బంగారం కొనడం సాంప్రదాయంగా ఆచరించ బడుతున్నది. "వైశాఖే మాసి రాజేంద్ర, శుక్ల పక్ష తృతీయ కా: అక్షయాసా తిథి: ప్రోక్తా కృత్తికా రోహిణీ యుతా:

అక్షయ తృతీయ సోమ లేదా బుధవారాల్లో అయితే విశిష్టమని, కృత్తిక రోహిణీ నక్షత్రముతో కూడి ఉన్నది అయితే, పర్వం అతి ప్రశస్తం అని భావన. ఈ పర్వం పూర్వాహ్న వ్యాపిని అనీ, వ్రత రాజము చెపు తున్నది. ఇది ఒక గొప్ప పుణ్య దినంగా భావించ బడుతున్నది. ఈనాడు నదీస్నానం, సకల పాప విమోచన కరమని, ఒక పూట భోజనం చేయాలని భక్తుల విశ్వాసం. లక్ష్మి సహిత నారాయణుని, గౌరీ సహిత త్రిలోచనుని, పూజించడం శ్రేష్ఠం తరంగా చెప్పబడింది. పూజ సమయంలో విసనకర్రలు, లడ్డూలు పంచితే వైకుంఠాన్ని, శివ లోకాన్ని పొందగలరని శాస్త్ర వచనం.

### :: అక్షయ తృతీయ విశిష్టతలు ::

మన పురాణాలు, పండితులు చెబుతున్న అక్షయ తృతీయ విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజే మహా విష్ణువు ఆరవ అవతారమైన పరశురాముని జననం.ఈ పవిత్ర దినానే త్రేతాయుగం ప్రారంభమైనదని పండితుల మాట. గంగమ్మ భువిపై ఉద్భవించిన రోజు ఈ రోజే. అక్షయ తృతీయ నాడే వ్యాస మహర్షి "మహా భారతం" పవిత్ర గ్రంథాన్ని రచన పారంభించిన రోజు. ఈ రోజే అమ్మ "అన్నపూర్ణ దేవి" అవతరించిన రోజు. అక్షయ తృతీయ పవిత్ర దినాన్నే కుబేరుడు శివానుగ్రహాన్ని పొంది మహాలక్ష్మి ద్వారా అనంత సంపదను పొంది సంరక్షకుడిగా నియమింప బడ్డాడు. శ్రీకృష్ణుడు ద్రౌపదిని దుశ్శాసన దుశ్చర్య నుండి కాపాడిన దినం. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను ఆరగించి అపార సంపదను అనుగ్రహించిన రోజు. సూర్య భగవానుడు అజ్ఞాత వాసంలో పాండవులకు "అక్షయపాత్ర"ను ఇచ్చినరోజు. ఆదిశంకరుల వారు ఓ పేద వృద్ధ జంట లబ్ధి కోసం సృష్టిలో తొలిసారి "కనకధారాస్తవం" స్తుతించిన రోజు. ఈ పవిత్ర దినానే, దివ్య క్షేత్రం "బద్రీనాథ్" ఆలయ ద్వారాలు 4 నెలల దర్శన విరామం తర్వాత, పునః దర్శనార్థమై తెరుచుకో బడతాయి. ఏ ఏటికా ఏడు ఒడిషా పూరి రథయాత్ర సంబరాల కొరకు నిర్మించే రథ నిర్మాణం ప్రారంభించే రోజు. ఈరోజే సింహాచలం దివ్యక్షేత్రంలో సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం మరియు చందనోత్సవం ప్రారంభపు రోజు. బృందావనం లోని బంకే బిహారి ఆలయంలో, శ్రీకృష్ణుని పాదాలను దర్శించుకొనే అవకాశం ఒక్క అక్షయ తృతీయ రోజునే దక్కుతుంది.

# సన్‌రైజర్స్ సత్తా!





**హైదరాబాద్, ఏప్రిల్ 18:** సొంత గడ్డపై సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) సత్తా చాటింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (సీ ఎస్ కే) పై 10 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ ఆర్ హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సీ ఎస్ కే పోరాడినా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ, బౌలింగ్ లో ఈషాన్ మలింగ అద్భుత ప్రదర్శనతో సన్ రైజర్స్ కు విజయాన్ని

## ఆకాశమే హద్దుగా అభిషేక్, క్లాసెన్

మొదట బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ట్రావిస్ హెడ్ 20 బంతుల్లో 23 పరుగులు చేసి రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 39 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. చివర్లో వికెట్లు పడినా.. సన్ రైజర్స్ 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. సీ ఎస్ కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. జేమీ ఓవర్టన్ 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ముకేశ్ చౌదరి 2 వికెట్లు తీశాడు.

## తడబడిన చెన్నై ఛేదన

195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. సన్ రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెన్నై బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ మ్యాట్ షార్ట్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి కాస్త పోరాడాడు. మిడిలార్డర్ లో కుర్రాడు ఆయుష్ మ్హాత్రే 13 బంతుల్లోనే 30 పరుగులు చేసి ఆశలు రేపాడు. సర్ఫరాజ్ ఖాన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. వీరు మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ భారీ స్కోర్లు చేయలేకపోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు.

## కట్టడి చేసిన బౌలర్లు

సన్ రైజర్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. ఈషాన్ మలింగ తన 4 ఓవర్ల కోటాలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ నితీశ్ కుమార్ రెడ్డి 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శివాంగ్ కుమార్ తన 3 ఓవర్ల స్పెల్ లో కేవలం 18 పరుగులు ఇచ్చి ఒక వికెట్ దక్కించుకుని చెన్నై బ్యాటర్లను కట్టడి చేశాడు. బౌలర్ల సమష్టి కృషితో సన్ రైజర్స్ సొంత మైదానంలో అభిమానులకు ఉత్కంఠ



# ఢిల్లీ ధమాకా!

**బెంగళూరు, ఏప్రిల్ 18:** ఐపీఎల్ లో మరో ఉత్కంఠ భరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ పోరులో ఢిల్లీ కేవలం ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనలో డీసీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒత్తిడిని జయించి అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించిన ట్రిస్టన్ స్టబ్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## సాల్ట్ మెరిసినా.. తడబడిన మిడిలార్డర్

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీ కి ఓపెనర్ ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 38 బంతుల్లోనే 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విరాట్ కోహ్లీ (13 బంతుల్లో 19) కాసేపు మెరుపులు మెరిపించాడు. ఒక దశలో ఆర్సీబీ భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే డీసీ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మిడిలార్డర్ తడబడింది. చివర్లో టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 26) రాణించడంతో ఆర్సీబీ 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. డీసీ బౌలర్లలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎంగిడి తలా రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

ఆఖరి బంతి ముంగిట డీసీ విజయం

నిలిచిన స్టబ్స్, రాహుల్ క్రీజు పోరాటం

సత్తా చాటిన ఢిల్లీ స్పిన్నర్లు

సాల్ట్ మెరుపులు, కోహ్లీ శ్రమ వృథా

ఆకట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ ఆటతీరు

**బెంగళూరుకు తప్పని పరాజయం**




## రాహుల్ మెరుపులు.. స్టబ్స్ ఫినిషింగ్

176 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్ కేఎల్ రాహుల్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 57 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ బాధ్యతాయుతంగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా అక్షర్ పటేల్ (19 బంతుల్లో 26) తో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. భువనేశ్వర్ కుమార్ (4 ఓవర్లలో 3/26) అద్భుతమైన బౌలింగ్ తో ఢిల్లీని దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. కానీ స్టబ్స్ (47 బంతుల్లో 60 నాటౌట్) క్రీజులో పాతుకుపోయి మ్యాచ్ ను విజయవంతంగా ముగించాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు అవసరమైన దశలో రోమారియో షెఫర్డ్ బౌలింగ్ లో లాంఛనాన్ని పూర్తి చేశాడు.

శ్రీ తొలిక్రాంతి
RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
SRITHOLIKRANTHI



## రస్ట్ రెడ్ లుక్‌లో అదరగొట్టిన
# ‘ఫౌజీ’ లేడీ



కన్నడ సినీ ప్రపంచంలో ‘సప్త సాగరాలు దాటి సైడ్ బి’ చిత్రంతో తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న చైత్ర జే ఆచార్ ఇప్పుడు తన కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోందని టాక్ వినిపిస్తోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్‌గా పేరొందిన ఆమె, త్వరలోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ‘ఫౌజీ’లో చైత్రకు అవకాశం దక్కినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇదే నిజమైతే, చైత్రకు ఇది తెలుగు తెరపై ఎంతో ఆసక్తికరమైన డెబ్యూ అవుతుంది. 1940ల కాలనీయ భారతదేశం నేపథ్యంగా రూపొందుతున్న ‘ఫౌజీ’ ఒక పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఇమాన్వి కూడా ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైత్ర ఇటీవల రస్ట్ రెడ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సింపుల్ స్టైల్‌తోనే ఎలిగెంట్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ ఆమె అందం అభిమానులను ఆకట్టుకుంటోంది. నటనతో పాటు స్టైల్‌లోనూ మెప్పిస్తున్న చైత్ర, ‘ఫౌజీ’తో టాలీవుడ్‌లో ఎలాంటి ముద్ర వేస్తుందో చూడాలి. ఈ సినిమా 2026 చివరలో లేదా 2027లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## అందంలో సూపర్ హిట్...
# సక్సెస్ యావరేజ్


మోడలింగ్ నుంచి వెండితెరకు వచ్చిన దివ్యభారతి తన అందం, స్టైల్‌తో తొలినాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. కానీ తొలి సినిమా తర్వాత రావాల్సిన అవకాశాలు ఆలస్యమవడంతో ఆమె కెరీర్ ఊహించినంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఆమె దగ్గర ఉన్న ప్రతిభ పూర్తిగా బయటపడే అవకాశాలు ఇంకా దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమాల్లో విరామం కనిపించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆమె ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల రాయల్ బ్లూ గౌన్‌లో చేసిన ఫోటోషూట్‌లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాదాసీదా లుక్‌లోనూ ఆకట్టుకునే గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కెమెరా ముందు ఆమె చూపించే ఆత్మవిశ్వాసం, ప్రెజెన్స్ మాత్రం ఎప్పటికీ తగ్గదని మరోసారి స్పష్టమైంది. అయితే నిజమైన గుర్తింపు మాత్రం ఒక పెద్ద విజయంతోనే వస్తుంది. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే దివ్యభారతి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందంతో ఆకట్టుకున్న ఆమె, కెరీర్‌లో కూడా అదే స్థాయి విజయాన్ని ఎప్పుడు అందుకుంటుందో చూడాల్సి ఉంది.



# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో ’లేడీ సూపర్ స్టార్’ నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళు _న్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.







# వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం ’వారణాసి’. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.

## గోల్డ్ లుక్‌లో గ్లామర్ షో..
# ప్రగ్యా హాట్ హంగామా!

ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. సినిమాల్లో అందంతో ఆకట్టుకునే ఈ బ్యూటీ, ఆఫ్‌స్క్రీన్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తూ అభిమానులను మెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ప్రగ్యా గోల్డ్ కలర్ స్లీవ్‌లెస్ టైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ హాట్ హంగామా సృష్టించింది. సింపుల్ యాక్సెసరీస్‌తోనే స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ, చిన్న ఈయర్‌రింగ్స్, గోల్డ్ హైహీల్స్‌తో తన అవుట్‌ఫిట్‌ను మరింత హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రగ్యా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చూపించింది. ఈ ఫోటోలలో ఆమె అందం, స్టైల్ కలిసి అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. గోల్డ్ లుక్‌లో ప్రగ్యా చూపించిన ఈ గ్లామర్ షో, ఆమె ఫ్యాన్స్‌కు మరో విజువల్ ట్రీట్‌గా మారింది.

# బన్నీలో ఆ గ్రేస్ చాలా ఇష్టం

తెలుగు ప్రేక్షకులకు ‘ఉయ్యాలా జంపాల’ సినిమాతో దగ్గరైన అవికా గోర్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తన అభిమానం వ్యక్తం చేసింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బన్నీ డాన్స్ స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పింది. ముఖ్యంగా ఆయనలో కనిపించే గ్రేస్ చాలా ప్రత్యేకమని, అదే తనకు అత్యంత ఇష్టమని పేర్కొంది. “డాన్స్‌లో ఆయన చూపించే ఆ ఫ్లో, ఈజ్ చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి గ్రేస్ ప్రతి ఒక్కరికి సాధ్యం కాదు” అని ఆమె తెలిపింది. అల్లు అర్జున్ కేవలం డాన్స్‌లోనే కాకుండా, తనను తాను తీర్చిదిద్దుకునే విధానంలోనూ ఎంతో ప్రేరణనిస్తారని అవికా చెప్పింది. ఆయనలో ఉండే ఎనర్జీ, పాజిటివ్ వైబ్ తనను బాగా ఆకట్టుకుంటాయని పేర్కొంది. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఎదిగిన బన్నీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

Printed, Published and Owned by **MALOTHU RAMARAO,** Printed at M/s.KAKATIYA PRINTERS, 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR COLONY, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039. **Editor: MALOTHU RAMARAO CHANDRAKALA.**
H.NO: 3-59,GANDLAGUDEM VILLAGE,ANANTHARAM POST , ASWARAOPETA MANDAL, BHADRADRI KOTHAGUDEM , KHAMMAM, TELANGANA - 507301.Telangana **RNI No :TGTEL/26/A2143** Contact: 83281 23579,email id:venkatnaik66666 @gmail.com